శ్రీనివాస బాలభారతి–20

# అన్నమాచార్యులు


రచన:

కె. శ్రీనివాసులుశెట్టి

సంపాదకుడు:

డాక్టర్ ఎస్. బి. రఘునాథాచార్య



ప్రచురణ:

శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఏ. ఎస్.

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1982

SRĪNIVĀSA BĀLABHĀRATI — 20
[*Children Series*]

ANNAMACHARYULU
*by*
**K. Srinivasulu setty**

*Chief-Editor* :
**Dr. S. B. Raghunadhacharya**

*First Edition* : 1982

Copies: 10,000

Price : 1-00

**Published by:**

**Sri P. V. R. K. PRASAD,** I. A S.
EXECUTIVE OFFICER,
Tirumala Tirupati Devasthanams.
TIRUPATI,

*Art* : BAPU

**Printed at :**

Tirumala Tirupati Devasthanams Press, Tirupati.

# మా మాట

చిన్నపిల్లల మనసులు చల్లనైనవి; నిర్మలమైనవి చక్కగా పెరిగిన పిల్లలు భావిభారతపౌరులై మంచి సభ్యత సంస్కారం పెంచుకొని, తమ కుటుంబానికి, దేశానికి కూడ పేరుప్రతిష్ఠలను సంపాదించి గర్వకారణమౌతారు. మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహాపతివ్రతలు ఎలాంటివారు, వారంత గొప్పవారెలా అయినారనే విషయం వారికథను చెపుతూ పిల్లలకు తెలియజేయ గలిగితే, దాని ప్రభావం లేతమనస్సులపైన చక్కని సంస్కార ముద్రలను వేయగలుగుతుంది. అవి భవిష్యత్తులో వారి కెంతగానో ఉపయోగపడతాయి.

ఈ ఉద్దేశ్యంతోనే "శ్రీనివాసబాలభారతి" అనే పుస్తకమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటిస్తోంది. ఇందులో మన భారతదేశంలో అనేక ఆదర్శాలకు ప్రసిద్ధు లైన మహాత్ముల చరిత్రలు చిన్న చిన్న వాక్యాలలో,

చక్కని కథాకథన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. చిన్నారి బాలలు వీటిని బాగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం.

ఈ ప్రణాళికను రూపొందించి, రచనలను తయారు చేయించి, వాటిని కావలసిన పద్ధతిలో సంపాదించిన డాక్టర్ ఎస్. బి. రఘునాథాచార్య (కో-ఆర్డినేటర్, పబ్లికేషన్స్ టి.టి.డి.) గారికి నా అభినందనలు. ఈ ప్రణాళికలో మాతో సహకరించిన రచయితలకు, కళాకారులకు మా ధన్యవాదాలు.


పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# స్వాగతం!!

శ్రీనివాసదయోద్భూతా బాలానాం స్ఫూర్తిదాయినీ ।
భారతీ జయతాల్లోకే భారతీయగుణోజ్జ్వలా ॥

ఖండ ఖండాంతరాల్లో నాగరికత కన్నువిప్పేనాటికే సభ్యతకు సంస్కారానికి, నైతిక-ధార్మికాదర్శాలకు పేరు పడ్డది మన భరతఖండం. ఈ గడ్డపై పుట్టిన ప్రతి మానవుడు అధర్మాన్ని ఎదిరిస్తూ, ధర్మాచరణంలో తన జీవితాన్ని పండించుకొని, మాధవాభిముఖంగా నడచి మహనీయకీర్తి నార్జించినవాడే. అలాంటి మహాత్ముల సన్నిధి మన సుఖసంతోషాలకు పెన్నిధి. కనీసం వారి జీవితాదర్శాలు మనస్సుల్లో మెదిలితే వాటి ప్రభావం మనమీద ఎంతో ఉంటుంది. 'నేను భారతీయుణ్ణి' ఇది తరతరాల నుంచి వస్తున్న నా సంప్రదాయం 'ఇది నా కర్తవ్యం' అని ప్రతిబాలుడు, బాలిక. ఈ దేశసేవకు తనను అంకితం చేసుకొంటారు.

నిజానికి ఈ దేశంలో ఎందరో మహానుభావులు, మహాపురుషులు, మహాపతివ్రతలు, మహావీరులు పుట్టి,

పెరిగి, చక్కని సంస్కృతికి పునాదులు వేశారు. స్వచ్ఛమైన జీవనవాహినిని మనదాకా ప్రవహింపజేశారు. ఆహా! మనమెంత అదృష్టవంతులం! మన వెనుక ఎంత ఉదాత్తమైన చరిత్ర ఉంది! ఆ పుణ్యపురుషులు, మహాసాధ్వులు, ఇక్కడ పుట్టకపోతే మనదిగా మనం చెప్పుకొనే మహత్తరమైన ఈ సంస్కృతి, సభ్యత మనకెలా సంక్రమించేవి? వాళ్లను అర్థం చేసుకోవడం, వాళ్ల చరిత్ర మననం చేసుకోవడం, వారి ఆదర్శాలు స్మరించడం కూడ మనకు గొప్ప విజ్ఞానాన్నందించే విద్యాభ్యాసం. అది ముందు ముందు మనజాతి జీవనప్రవాహంలో కొన్ని ఏండ్లదాకా చెక్కుచెదరని స్ఫూర్తిసౌరభాలను విరజిమ్ముతుంది. అందుకే శ్రీనివాసబాలభారతి ఉదయించింది. ఎందరో మహానుభావుల్ని మీ ముందుంచుతోంది. ఇక మీదే ఆలస్యం. బాలలూ! రండి! రండి!

నిండు మనస్సుతో మీకిదే మా స్వాగతం!

ఎస్. బి. రఘునాథాచార్య

ప్రధాన సంపాదకుడు

భౌతికమైన భోగభాగ్యాలకోసం ప్రభువులను ప్రస్తుతించడం చాలామందికి పరిపాటి. "పరమాత్మను కీర్తించిన నా నాలుక పరులను కీర్తించలేదని" తనకాశ్రయమిచ్చిన రాజునెవరైనా నిరాదరించగలరా? నిరాదరించి నెగ్గగలరా? అది కేవలం కారణజన్ములకే సాధ్యం.

మన చరిత్రలో అలాంటి మహాపురుషులెవరైనా ఉన్నారా? లేకేం? ఉన్నాడొక మహానుభావుడు. 'వేంకటపతి కర్పించిన వాక్కుతో నిన్ను స్తుతించలేనని' రాజాగ్రహానికి గురై చెఱసాల్లో పడ్డాడు. ఆర్తితో ఆయన శ్రీనివాసుని కీర్తించే సరికి సంకెళ్ళు రాలి క్రింద పడ్డాయి. ఆయనెవరో కాదు; పదకవితాపితామహుడు, సంకీర్తనాచార్యుడైన అన్నమాచార్యుడు.

అలమేల్మంగ వేంకటేశ్వరుల అనుగ్రహంతో వేల కొలది సంకీర్తనలను మనకందించిన అన్నమాచార్యుడు భక్తికి ప్రతిరూపం. సర్వస్వం శ్రీనివాసుడే అని నమ్మిన ఆయన ప్రపత్తి మన సంపత్తి. రాగబద్ధమై కూడ మన రాగబంధాలను తెంచేసే ఆయన వాఙ్మయం మనకు మహోజ్జ్వలమైన వెలుగుబాటు కావాలి.

—ప్రధాన సంపాదకుడు

# అన్నమాచార్యులు


* * * *

అదిగో తెలుగు తల్లి తన కన్నబిడ్డకు గోరుముద్దలు తినిపిస్తూ పాడుతూంది.

'చందమామ రావో జాబిల్లి రావో, మంచి
కుందనంపు పైడికోర వెన్నపాలు తేవో'

ఈ చందమామ పాట వ్రాసిందెవ్వరో తెలుసా? తాళ్లపాక అన్నమాచార్యులు. వేంకటేశ్వరస్వామికి గొప్ప భక్తుడు; మహా కవి. మన తెలుగులో తొలి వాగ్గేయకారుడు. వాగ్గేయకారుడంటే పాటలు స్వయంగా వ్రాసి పాడేవాడని అర్థం. వేంకటేశ్వరుడు, అన్నమయ్య మేలుకొలుపు పాట పాడుతూంటే విని నిద్రలేచేవాడు. మళ్లీ ఆయన జోలపాట పాడందే నిద్రపోడు. స్వామికే గాదు అమ్మవారికి కూడ అన్నమయ్య పాటలంటే చాల ఇష్టం. ఆయన పాడుతూంటే అలమేలు మంగమ్మ ఆనందంతో నాట్యం చేసేది. ఇంత గొప్పవాడైన ఆ భక్తుణ్ణి గురించి తెలుసుకుందామా? మరి.

సుమారు ఆరువందల ఏండ్ల క్రితం నాటిమాట.




### తాళ్ళపాక :

కడపజిల్లా రాజంపేట తాలూకాలో తాళ్ళపాక అనే గ్రామం ఉంది. అక్కడ రెండు గుళ్ళున్నాయి. ఒకటేమో చెన్న కేశవ స్వామి గుడి, ఇంకొకటి సిద్ధేశ్వరస్వామి దేవళం. చెన్న కేశవ స్వామి విగ్రహాన్ని జనమేజయమహారాజు ప్రతిష్ఠ చేశాడు. ఈ స్వామిని దేవతలు, ఋషులు, సిద్ధులు ప్రతిరోజు వచ్చి పూజిస్తారు. ఈ చెన్నకేశవస్వామి గుడిని ఆశ్రయించుకొని కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు జీవించేవి. వాళ్ళలో నారాయణయ్య చాల ప్రసిద్ధుడు. ఇతని నాలుగోతరంలో మరో నారాయణయ్య ఉండేవాడు. ఈ నారాయణయ్య కథతోనే మన అన్నమయ్యకథ మొదలౌతుంది.

### ఎందుకు బాబు ఈ అఘాయిత్యం?


నారాయణయ్యకు చిన్నతనంలో ఎంతకీ చదువు రాలేదు. తండ్రి నయాన భయాన చెప్పి చూశాడు. లాభం లేక పోయింది. తన వద్ద ప్రయోజనం లేదని ప్రక్కనే ఊటుకూరులో తన బంధువుల వద్ద ఉంచాడు. అక్కడ బళ్ళో ఉపాధ్యాయులు శతవిధాల ప్రయత్నించారు. నారాయణుని కళ్ళల్లో నీళ్ళే తప్ప నోట సరస్వతి పలకలేదు. వాళ్ళు విసిగిపోయి బాలుని రకరకాల శిక్షలకు గురి



చేశారు. కోదండం వేశారు, కోలగగ్గెర తగిలించారు. నారాయణయ్య లేత మనస్సు గాయపడింది. నలుగురూ అవహేళన చేస్తున్నారు. సిగ్గుతో, అవమానంతో క్రుంగిపోయాడు. ఇంతకంటె చావు మేలను కున్నాడు. ఎవరో చెబుతుండగా విన్నాడు, ఊరి చివర చింతలమ్మ గుడి పుట్టలో పెద్ద పామున్నదని. నారాయణుడు ఒంటరిగ గుడి చేరి పుట్టలో చేయి పెట్టాడు. పాము కరవలేదు సరిగదా! ఎదురుగ చింతలమ్మ ప్రత్యక్షమైంది. నారాయణయ్య ఏడుస్తూ ఆమె పాదాల మీద పడ్డాడు. చింతలమ్మ ఆ బాలుని తన ఒళ్లో చేర్చుకొని వూర డించింది. "ఎందుకు బాబు ఈ అఘాయిత్యం? నీ మూడోతరంలో గొప్ప హరి భక్తుడు జన్మిస్తాడు. అతని వల్ల మీ వంశమే తరి స్తుంది. నీకు చదువు రాకపోవడమేమిటి వెళ్లు. తాళ్లపాక చెన్న కేశవస్వామే నీకు అన్నీ అనుగ్రహిస్తాడు" అని చింతలమ్మ బాలుని చింత తీర్చి అదృశ్యమైంది. అమ్మ చెప్పినట్లు నారాయణయ్యకు చెన్నకేశవస్వామి దయవల్ల అన్ని విద్యలూ సిద్ధించాయి. ఈ నారాయణయ్య కుమారుడే నారాయణసూరి.

తిరుమల తీర్థయాత్ర:

నారాయణసూరి గొప్ప కవి, పండితుడు. ఇతని ఇల్లాలు లక్కమాంబ. మహాభక్తురాలు. మధురంగా పాడుతుంది. ఈమె



స్వగ్రామం మాడుపూరు. అక్కడ చెన్నకేశవస్వామి ఈమెతో ప్రత్యక్షంగా మాట్లాడేవాడట. ఈ పుణ్య దంపతులు సంతానం కోసం చేయని వ్రతం లేదు. కొలవని దేవుడూ లేడు. "మాకు మంచి కొడుకును ప్రసాదించు స్వామీ" అని ఏడు కొండలస్వామికి మ్రొక్కుకున్నారు. ముడుపులు కట్టుకున్నారు. ఒక మంచిరోజు చూసి ఇద్దరూ వేంకటేశ్వరస్వామి దర్శనంకోసం ప్రయాణ మయ్యారు.

లక్కమాంబ, నారాయణసూరి తిరుమల చేరారు. స్వామి మందిరం ప్రవేశించారు. గరుడగంభం వద్ద సాగిలి మ్రొక్కారు. వాళ్ళకేదో మైకం కమ్మినట్లైంది. కళ్ళు మిరుమిట్లు గొలిపే తేజస్సు కనిపించి ధగధగ మెరిసే ఖడ్గాన్ని వాళ్ల చేతుల్లో పెట్టి అదృశ్య మైంది. వేంకటేశ్వరస్వామి తన ఖడ్గమైన నందకాన్ని ఆ పుణ్య దంపతులకు ప్రసాదించాడు. వాళ్ళు పరమానందభరితులయ్యారు. వేంకటపతిని దర్శించి స్తుతించారు. సంతోషంతో తాళ్ళపాకకు తిరిగి వచ్చారు.

జననం :

లక్కమాంబ గర్భవతి అయింది. వైశాఖమాసం విశాఖ నక్షత్రంలో, ఒక శుభలగ్నంలో మూడు గ్రహాలు ఉన్నత దశలో

ఉండగా మగశిశువు ఉదయించాడు. అంటే క్రీ.శ. 1408 లో అన్నమాట. హరినందకాంశంలో జన్మించిన ఆ హరిభక్తునికి అన్నమాచార్యులు అని నామకరణం చేశారు. అన్నమయ్య బోసి నవ్వులు ఒలకబోస్తూ నలుగురినీ మురిపించేవాడు. మాటి మాటికి వెంకటప్పకు జోతలు పెట్టేవాడు. వెంకన్న పేరు చెబితేనే ఉగ్గుపాలు త్రాగే వాడు. వెంకటపతిమీద జోలపాట పాడందే నిద్రపోడు. లక్క మాంబ భక్తి గీతాలు పాడుతూంటే ఏదో అర్థమైనట్లు తల పంకించే వాడు. నారాయణసూరి కావ్యాలలో అర్థాలు వివరిస్తూవుంటే తానూ ఊ కొట్టేవాడు.

బాల్యం :

అన్నమయ్యకు ఐదేండ్లు నిండాయి. అతడు ఏక సంథా గ్రాహి. గురువులు చెప్పిన పాఠాలు చెప్పినట్లు వెంటనే అప్పచెప్పే వాడు. వాళ్ళు ఆశ్చర్యపడేవాళ్ళు. ఇంక అన్నమయ్యకు నేర్పించ వలసింది ఏమీ లేదని త్వరలోనే తెలుసుకున్నారు. అన్నమయ్య ఆడిందెల్లా అమృతమయమైన కావ్యంగా పాడిందెల్లా పరమగానంగా వినిపించేది. అన్నమయ్య చెన్నకేశవుని గుడిచేరి "బుజ్జి కేశవా!" అని పిలిచేవాడు.

బుజ్జిబాలుని ముద్దు మాటలకు మురిసి చెన్నకేశవుడు సిరి నవ్వులు చిందించేవాడు. అన్నమయ్య ఎప్పుడూ ఆటల్లో పాటల్లో మునిగి తేలేవాడు. చెఱువు కట్టలమీద చేరి చెట్టుమీది పిట్టలతో గొంతు కలిపేవాడు. చిరుగాలుల సవ్వడికి మురిసేవాడు. చెరువులోని అలలలో ఉయ్యాలలూగే కమలాలను చూస్తూ గంతులేసేవాడు. కన్నె పిల్లలు వెన్నెల రోజుల్లో జాజర పాటలు పాడుతూంటే అక్కడ చేరుకొని వాళ్లను అల్లరి పెట్టేవాడు. రాగం పాడీ, తాళం వేసీ చూపేవాడు. "మీకేం తెలీదు పొమ్మ"ని ఎగతాళి చేసేవాడు. కలుపు పాటల్లో, కవిల పాటల్లో జానపదులతో బాటు శ్రుతి కలిపే వాడు. అన్నమయ్య మాటన్నా పాటన్నా ఆ వూరి వాళ్లు ఎంతో సంబరపడిపోయే వాళ్లు.

## ఇంటిపని ఎవరు చూస్తారు?


నారాయణసూరిది పెద్ద కుటుంబం. ఉమ్మడి కుటుంబాలలో చిన్న చిన్న కలతలు తప్పవు. వాళ్ల కోపతాపాలు అర్థం లేనివి, ఇంతలో తగవులాడుతారు. అంతలో కలిసిపోతారు. ఒకనాడు అందరు కలిసికట్టుగ అన్నమయ్యమీద విరుచుక పడ్డారు. అన్న మయ్యకు దిక్కు తెలియలేదు. "ఎప్పుడూ ఆ దండె భుజాన తగి



లించుకొని పిచ్చి పాటలు పాడుకోవడమేనా? ఇంట్లో పనీ పాట ఎవరు చూస్తారు?" అని ఇంటివాళ్లు దెప్పి పొడిచారు. "గాలి పాటలు కట్టిపెట్టి, అడవికెళ్ళి పశువులకింత గడ్డి తెచ్చిపడేయ్." ఏ విసుగులో వున్నాడో నారాయణసూరి కొడుకును కసరినంత పనీ చేశాడు. లక్కమాంబ మాత్రం కొడుకువైపు జాలిగ చూసింది. అన్నమయ్య ఏమీ బదులు పలకలేదు. కొడవలి భుజాన తగిలించు కొని అడవికి బయలుదేరాడు.

ఎవరికెవరు?

అన్నమయ్యకు అడవికెళ్లడం అలవాటు లేదు. ఒక చెట్టు కింద చతికిలబడ్డాడు. తంబుర చేతిలోనే వుంది. తీగలు సవరించి పాడబోయాడు. పక్కన కొడవలి వుంది. దాన్ని జూస్తూనే వచ్చిన పని గుర్తుకు వచ్చింది. లేచి చుట్టూ పరికించాడు. ఒక చోట పచ్చిక బాగా బలిసి వుంది. కొడవలితో కోస్తున్నాడు. ఉన్న ట్లుండి "అమ్మా!" అని కేక పెట్టాడు. చిటికెనవ్రేలు తెగి రక్తం బొటబొటా కారుతున్నది. రక్తం చూస్తూనే కళ్లు తిరిగిపోయాయి. బాధతో మూలిగాడు. ఈ అవస్థకు కారణం ఎవ్వరు? ఒక్క మారు తన బంధువుల్ని తల్లిదండ్రుల్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.



"అంతా అబద్ధం. తనకు ఎవ్వరూ లేరు. లౌకిక బంధాలతో తనకు పని లే "దను కున్నాడు. దూరాన తిరుపతికి వెళ్ళే యాత్రికుల గుంపు కనిపించింది. వాళ్లు ఆడుతూ పాడుతూ వెళ్తున్నారు. చేతిలోవున్న కొడవలి విసిరేశాడు. తంబుర చేత పట్టుకొని ఆ గుంపులో కలిసి పోయాడు.

## అన్నమయ్య తిరుపతి చేరాడు :

ఆ యాత్రికులు ఎవ్వరో కారు, సనకుడు మొ॥ మహాభక్తులు. వాళ్ల వేషం తమాషాగా వుంది. జింక చర్మంతో చేసిన కిరీటాలు పెట్టుకున్నారు. అభ్రకము, ఆకులు కలిపి కుట్టిన బట్టలు వేసుకున్నారు. నొసట పట్టెనామాలు, శంఖ చక్రాల ముద్రికలు, కాళ్లకు కంచు అందెలు, చేతిలో బాణాలున్నాయి. దండెలు మీటుకుంటూ, చిటి తాళాలు వాయిస్తూ మద్దెల మ్రోగిస్తూ భక్తి పారవశ్యంతో పాడుతూ చిందులేస్తూ మధ్యలో "గోవింద! గోవింద!" అంటూ నినాదాలు చేస్తున్నారు. అన్నమయ్య వాళ్లతో కలిసి తిరుపతి చేరాడు.

## అదివో అల్లదివో!

తిరుపతి చేరుతూనే గంగమ్మ గుడికెళ్లాడు. గ్రామశక్తికి దండం పెట్టాడు. అలిపిరి చేరాడు. అక్కడ నరసింహస్వామికి

నమస్కారం చేశాడు. అలిపిరి కొండకు చుక్కల పర్వతం అని కూడా పేరు. భగవంతుని చేరడానికి ఇది తొలిపాదం. ఇక్కడ 'తలేరు గుండు' వుంది. ఆ గుండుమీద ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. అన్నమయ్య ఆ గుండుకు నమస్కరించాడు. ఈ గుండులో ఎన్నో మహిమలున్నాయట. కొండ ఎక్కే భక్తులు ఈ గుండును తలతో మోకాటితో తాకి దండం పెట్టుకుంటే తలనొప్పి, కాళ్ల నొప్పులు ఉండవని నమ్మకం. ఎత్తుగ విశాలంగ వ్యాపించి వున్న పర్వత శిఖరాలను చూశాడు. ఆదిశేషుని పడగల్లా కనిపించాయి. ఆనందంతో చిందులు త్రొక్కుతూ పాడసాగాడు:

అదివో అల్లదివో హరివాసము
పదివేల శేషుల పడగలమయము
అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిలమునులకు
నదె చూడుఁడదె మ్రొక్కుఁడానందమయము
కైవల్యపదము వేంకటనగమదివో
శ్రీవెంకటపతికి సిరులయినది.

భావింప సకల సంపదరూప మదివో
పావనముల కెల్ల పావనమయము

వేంకటేశ్వరస్వామి విహరించడానికి అనువుగా ఆదిశేషుడు క్రీడా శైలంగా నిలిచాడట.

**అన్నమయ్య అలసిపోయాడు :**

ఆ బాలభక్తుడు కొండ ఎక్కుతున్నాడు. అలిపిరి గోపురం సమీపిస్తున్నది. అక్కడ కొండ కొంత నిటారుగ వుంటుంది. దానికి 'పెద్ద ఎక్కుడు' అని పేరు. ఉత్సాహంగా అన్నమయ్య ఆ కొండ ఎక్కి గాలిగోపురం చేరాడు. కొంత దూరంలో కర్పూరపు కాలువ వుంది. అక్కడినుండి కమ్మని వాసనలు వ్యాపిస్తున్నాయి. గుబురు గుబురుగ అలముకున్న చెట్లను, పొదలను, జలజలా ప్రవహిస్తూ ఒయ్యారంగ సాగిపోతున్న కొండవాగులను చూసుకుంటూ మోకాళ్లకొండ చేరాడు. అక్కడ చేరేటప్పటికి మిట్ట మధ్యాహ్నమైంది. ఎండ కన్నెరగని పసిబాలుడు; ఎనిమిదేండ్ల వాడు, అన్నమయ్య అలసిపోయాడు. ఆకలిగ వుంది. శోష వచ్చినట్లైంది. దట్టంగ అలుముకున్న వెదురుపొదల కింద అలానే, చెప్పులకాళ్ల



తోనే వాలిపోయాడు. వెదురు బొంగులలో దూరి గాలి వేణువు ఊదుతూ ఆ పసిబాలునికి జోలపాటలు పాడింది.

**అలమేలు మంగమ్మ అనుగ్రహం:**

అన్నమయ్య అలసటను, ఆకలిని ఎవరు గమనించినా గమనించక పోయినా అలమేలు మంగమ్మ గమనించి కరుణించింది. మంగమ్మ పెద్ద ముత్తైదువలా అన్నమయ్యను సమీపించింది. తన ఒడిలో చేర్చుకొని శరీరం నిమురుతూ "లే! బాబు, లేచి ఇలా చూడు" అన్నది. అన్నమయ్యకు తన తల్లి లక్కమాంబ పిలుస్తున్నట్లనిపించింది. "అమ్మా!" అని లేచాడు. కాని కళ్లు కనపించడం లేదు. అమృతంలాంటి అమ్మ స్పర్శ; తేనెలూరే తల్లి పలుకులు. అన్నమయ్యకు దిక్కు తెలియడం లేదు. దీనంగ "తల్లీ! నాకు కళ్లు కనిపించడం లేదు" అన్నాడు. మంగమ్మ బాలుని ఊరడిస్తూ "బాబు ఈ కొండ సాలగ్రామ శిలలతో కూడుకొన్నది. చెప్పులు తొలగించి చూడు" అన్నది. అన్నమయ్య పాదరక్షలు తీసివేశాడు. పర్వతమంతా తేజస్సుతో విరాజిల్లుతున్నది. చెట్టు చెట్టులో మునిపుంగవులు కనిపిస్తున్నారు. మృగాలలో దేవతలు గోచరిస్తున్నారు. హరి దశావతారాలు క్రమంగా కనిపిస్తున్నాయి. వేదఘోషలు వినిపిస్తున్నాయి.

అన్నమయ్య ఆశ్చర్యంతో, ఆనందంతో ఆ పవిత్రమైన పర్వతానికి నమస్కరించాడు. అలమేలు మంగమ్మ అన్నమయ్యను దగ్గఱకు తీసుకొని ప్రసాదాలను తినిపించింది. అన్నమయ్యలో సరస్వతీ దేవి అంశ ప్రవేశించింది. తనకు తెలియకుండానే కవిత్వం పెల్లుబికింది. ఆవేశంతో ఆశువుగా ఒక శతకాన్ని అలమేలు మంగకు అంకితం చేశాడు. ఆ శతకంలో చంపకమాల, ఉత్పలమాల వృత్తాలు మాత్రమే వున్నాయి. అంటె సంపెంగలు, కలువలు అన్నమాట. పూలవంటి పద్యాలతో పూవుమీద పుట్టిన మంగమ్మ పాదాలను అర్చించాడు. 'అలమేలు మంగ' అంటే పువ్వుమీద నిలిచిన యువతి' అని అర్థం.


"అమ్మకు తాళ్ళపాక ఘను
డన్నఁడు పద్యశతంబు సెప్పె కో
కొమ్మని వాక్ప్రసూనముల
కూరిమితో నలమేలు మంగకున్
నెమ్మది నీవు చేకొని య
నేకయుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మదమంది వర్ధిలుము
జవ్వని లీలల వేంకటేశ్వరా!

పుష్కరిణీ స్నానం:

అన్నమయ్య నేరుగా పుష్కరిణి వద్దకు వెళ్ళాడు. దీనిని స్వామి పుష్కరిణీ అంటారు. సరోవరాలలో మహారాజు లాంటిది. ఈ పుష్కరిణిలో కొన్ని వేల పుణ్యనదుల నీళ్ళు కలుస్తాయట. ఇక్కడ స్నానం చేస్తే పాపాలన్నీ పటాపంచలై పోతాయట. అన్నమయ్య ఆ పవిత్ర జలాలలో స్నానం చేశాడు.

వరాహ క్షేత్రం:

అన్నమయ్య కొండెక్కి బాగా అలసిపోయాడా! అక్కడ స్నానం చేస్తూనే అతనికి అన్నినొప్పులూ తొలగిపోయాయి. మనస్సు ఎంతో నిర్మలంగా వుంది. నేరుగ వరాహస్వామిని దర్శించు కున్నాడు. తిరుమలకు వరాహక్షేత్రం అనిపేరు. అక్కడ అది వరాహస్వామి నివసించేవాడు. ఇతడే వేంకటేశ్వరస్వామికి ఉండ టానికి అనుమతి ఇచ్చాడు. దానికి కృతజ్ఞతగ తొలుత వరాహ స్వామి దర్శనం చేసుకొన్న తర్వాతనే తన దర్శనం అని వేంక టేశ్వరస్వామి కట్టడిచేశాడు. ఇప్పటికీ తొలిపూజా నైవేద్యాలు వరాహస్వామికే.



### అన్నమయ్య ఆలయప్రవేశం:

అన్నమయ్య ఆదివరాహస్వామిని సేవించుకొని వేంకటేశ్వరస్వామి కోవెలకు వెళ్ళాడు. పెద్ద గోపురాన్ని ఆశ్చర్యంగా చూశాడు. అక్కడ పెద్ద చింతచెట్టుండేది. దానికి మ్రొక్కాడు. కోరిన కోరికలు తీర్చే గరుడగంభానికి సాగిల పడ్డాడు. పెద్ద పెద్ద సంపెంగ మానులతో నిండి ఉన్న చంపక ప్రదక్షిణం చుట్టాడు. విమాన వేంకటేశ్వరుని దర్శించాడు. రామానుజులవారిని సేవించుకున్నాడు. యోగనరసింహస్వామికి నమస్కరించాడు. జనార్దనుని మూర్తికి మ్రొక్కాడు. వంట ఇంటిలో వెలసి ఉన్న అలమేలు మంగమ్మను అర్చించాడు. యాగశాలను దర్శించాడు. కల్యాణ మంటపాన్ని తిలకించాడు. వరుసగా వాహనమండపంలో ఉన్న అశ్వాన్ని, బంగారు గరుత్మంతుని ఆరాధించి, అందంగా నిలిచిఉన్న ఆదిశేషునికి మోకరిల్లాడు. గోవాదేశం నుండి తెప్పించిన తట్టు పునుగును బంగారు శలాకలకు గుచ్చి కరగిస్తున్నారు. యాత్రికులు గుంపులు గుంపులుగా "గోవింద, ముకుంద, తిమ్మప్ప" అంటూ ప్రదక్షిణాలుచేస్తున్నారు. బంగారు పంజరాలలో పంచవన్నెల రామచిలుకలున్నాయి. "వేంకటపతిని సేవించుకోండి; కానుకలు సమర్పించండి; కొండలప్పకు దండాలు పెట్టండి; మీరు కోరుకున్న

కోరికలు అన్నీ సమకూడుతాయి" అంటూ ఆ చిలుకలు పలుకుతున్నాయి. స్వామి పట్టుపీతాంబరాలున్న శ్రీభండారాన్ని చూశాడు. తన పంచెకొంగున అతిజాగ్రత్తగ దాచుకున్న ఒక కాసుతీసి, బంగారు గాదెలకు (హుండీ) నమస్కరించి, వడ్డికాసుల వానికి సమర్పించాడు.

## దివ్యమంగళ విగ్రహ సందర్శనం:

అన్నమయ్య, స్వామి సన్నిధిలో బంగారు వాకిళ్ళ వద్ద నిలిచాడు. శ్రీనివాసుని దర్శించాడు. అన్నమయ్య శరీరమంతా పులకాంకురాలు చెలరేగాయి. ఒళ్ళంతా కళ్ళు చేసుకొని చూస్తున్నాడు. ఒక చేతిలో చక్రం, మరొక చేతిలో శంఖం, బొడ్డులో మాణిక్యం, సూర్యకటారి, పాదాలకు అందెలు, పట్టుపీతాంబరం, కటి మీద ఒక చేయి, వరాలను ఇచ్చే వరద హస్తం చెవులలో నవనవలాడే మణికుండలాలు, కళలను వెదజల్లే ముఖం, ముత్యాల నామం, ధగ ధగ మెరిసే రత్న కిరీటం, శరీరమంతా పట్టించిన తట్టుపునుగు, కిరీటానికి ఇరువైపుల దిగవేసిన కలువపూచండ, వనమాల, శ్రీవత్సం, కౌస్తుభం, వెలలేని ఆభరణాలు - వేంకటేశ్వరుని దివ్య మంగళ విగ్రహాన్ని అలానే తిలకించసాగాడు. అన్నమయ్య

హృదయం ఉప్పొంగింది. అతని గొంతు నుండి కెరటాలు కెర టాలుగ భావగీతికలు వెలువడుతున్నాయి:

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము-
నెడయకవయ్య కోనేటి రాయఁడా,
కోరి మమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పి దీర్చుకాల మేఘమా, మాకు
చేరువఁ జిత్తములోని శ్రీనివాసుఁడా!

అన్నమయ్య పాటలు విని అర్చకులు ముగ్ధులై పోయారు. బాలుని దగ్గరకు తీసుకొని ప్రశంసిస్తూ తీర్థం, ప్రసాదం ఇచ్చి శఠ కోపం తలమీద ఉంచారు. అన్నమయ్య ఆ రోజు ఒక మండపంలో విశ్రమించాడు.

## పుణ్యతీర్థస్నానం :

ఆదినం ఏకాదశి. అన్నమయ్య కొండమీదఉన్న దివ్య తీర్థాలను చూడడానికి వెళ్ళాడు. "కుమారధారా తీర్థాన్ని" చూశాడు.

తారకాసురుని కుమారస్వామి చంపాడు కదా! అందుకని బ్రహ్మ హత్యాపాతకం అంటుకొన్నది. ఆపాపం పోగొట్టుకోవడానికి షణ్ముఖుడు ఇక్కడే తపస్సుచేశాడట. తర్వాత "అమర తీర్థం చేరాడు. ముక్కోటిదేవతలు ప్రతిరోజు ఈ తీర్థంలో స్నానంచేసి వెళ్తారట. అన్నమయ్య "ఆకాశగంగ" చూశాడు. పంద్రెండేండ్లు అంజనాదేవి తపస్సుచేసి హనుమంతుని కన్నచోటు. పాపాలను కడిగి పుణ్యాన్ని ప్రసాదించే "పాపవినాశనం" జలపాతంలో స్నానం చేశాడు. ఈ తీర్థాలలో స్నానంచేస్తూ అన్నమయ్య ఒక గమ్మత్తుచేసేవాడు. స్నానం చేసి తనబట్టలు ఆరవేసేవాడు. అవి ఆరేంతలోగా ఒక శతకాన్ని ఆశువుగా చెప్పేవాడు.

**ముత్యాలహారం కింద పడింది:**

ఒకరోజు అన్నమయ్య ఇలా స్నానసంధ్యాదులు ముగించు కొని వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వెళ్ళాడు. కాని ఆలయం తలుపులు మూసివున్నాయ్. ఆ బంగారు వాకిళ్ళకు తాళాలు బిగించారు. అన్నమయ్య చాలా నిరాశపడ్డాడు. ఎంతో ఆవేదనతో ఒక గీతాన్ని ఆలపించాడు. వెంటనే తాళాలు తెగిపడ్డాయి. కవాటాలు ఠక్కున తెరుచుకున్నాయి. అర్చకులు భయపడ్డారు. "అపరాధం

అపరాధం అని అన్నమయ్యను లోనికి పిలుచుకొని వెళ్లారు. అన్నమయ్య అక్కడ వేంచేసివున్న గరుడాళ్వారు, విష్వక్సేనులు, సుగ్రీవుడు, హనుమంతుడు మొదలైన భక్తులను, సీతారామ లక్ష్మణ మూర్తులను దర్శించుకుంటూ వేంకటేశ్వరస్వామి ఎదుట నిలిచాడు. అపర వేంకటేశ్వరునిలా అర్చకస్వామి స్వామిని పూజిస్తున్నాడు. ఆ సన్నివేశంలో అన్నమయ్య భావావేశం పొందాడు. వెంటనే ఒక పద్యశతకాన్ని సమర్పించాడు. స్వామి మెడలోని ముత్యాలహారం నేలపడింది. అర్చకులు సంభ్రమంతో బాలుని మహిమను కొనియాడారు. అర్చకుడు అన్నమయ్యను చూసి "వీడు సామాన్యుడుకాడు. కోనేటిరాయని దివ్యప్రసాదం" అన్నాడు. చందనం, తీర్థం, ప్రసాదం ఇచ్చి మనసార ఆశీర్వదించాడు. అన్నమయ్య కోనేటి ఒడ్డున కూర్చుని ప్రసాదాలు తిని స్వామి మహిమలను తలచుకొంటూ వరాహస్వామి కోవెలలో విశ్రమించాడు.


**ఘనవిష్ణువు కల :**

ఆరోజుల్లో ఘనవిష్ణువు అనే వైష్ణవయతి తిరుమలలో ఉండేవాడు. అతడు మహాభాగవతుడు. మాధవసేవచేస్తూ సాటి

మానవులకు విష్ణుతత్త్వాన్ని బోధించేవాడు. తన శేషజీవితాన్ని శేషాద్రినిలయునికే అంకితం చేశాడు. ఆ దినం ద్వాదశి. రాత్రి వేంకటపతి ఆ యతికి కలలో కనిపించి—"తాళ్ళపాక అన్నమయ్య అనే భక్తుడు రేపు నీదగ్గరకు వస్తాడు. వాడు నల్లగ అందంగ వుంటాడు. ఎప్పుడూ నామీద పాటలు పాడుతూ వుంటాడు. వాని చెవులలో మద్దికాయలు వ్రేలాడుతూ ఉంటాయి. పట్టుకుచ్చులున్న దండె భుజంమీద మోపి మీటుకుంటూ వుంటాడు వానికి నీవు ముద్రధారణం చెయ్యి; ఇవిగో నా ముద్రికలు" అని అందించాడు.

పంచసంస్కారదీక్ష:

మరునాడు ఉదయాన్నే స్నానసంధ్యాదులు ముగించుకొని ఘనవిష్ణువు స్వామి మందిరంలో యజ్ఞశాల వద్ద నిలుచున్నాడు. అతని చేతుల్లో స్వామి సమర్పించిన శంఖచక్రాల ముద్రలున్నాయి. అన్నమయ్య ప్రొద్దున్నే లేచి పుష్కరిణిలో స్నానంచేసి వరాహ స్వామిని దర్శించుకున్నాడు. వేంకటేశ్వరుని తొలిప్రాకారం చుట్టూ ప్రదక్షిణం చేశాడు. హరినామ సంకీర్తన చేసుకుంటూ యజ్ఞశాల ముందుకు వచ్చాడు. ఘనవిష్ణువు ఆ బాలుని చూశాడు. వానిలో స్వామి చెప్పిన గుర్తులను చూశాడు. మెల్లగా బాలుని సమీపించాడు.



"నాయనా! నీ పేరేమి?"

అన్నమయ్య యతికి పాదాభివందనం చేశాడు.

"అన్నమయ్య" ప్రవర చెప్పాడు.

యతి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"నీకు ముద్రధారణ చేస్తాను. సమ్మతమేనా?"

అన్నమయ్య యతిముఖాన్ని చూశాడు. వేంకటేశ్వరుడే కనిపించాడు. "కృతార్థుణ్ణి" అన్నాడు.

ఘనవిష్ణువు వేదోక్తంగా అన్నమయ్యకు పంచసంస్కారాలు నిర్వహించాడు. సాటి వైష్ణవులకు అన్ని విషయాలు తెలిపాడు. వాళ్లు తృప్తిపడ్డారు. అన్నమాచార్యుడు ఆవైష్ణవ పంక్తిలో కలిసి భోంచేశాడు. అన్నమయ్య అన్నమాచార్యుడయ్యాడు.

**కొడుకును వెదుకుతూ:**

అన్నమయ్య చెప్పాచేయకుండా తిరుమలకు వెళ్ళిపోయాడు. ఇక్కడ తాళ్లపాకలో తల్లిదండ్రులు కన్నబిడ్డకోసం వెదకి వెదకి కానక క్రుంగిపోయారు. లక్కమాంబ చెన్నకేశవుని గుడిపదలి


రాపడంలేదు "అన్నా! అన్నా!" అని కలవరిస్తూనేవుంది. నారాయణయ్య వెర్రివాడిలా అయిపోయాడు.

ఆ రోజు ద్వాదశి. అవూరివాళ్లంతా అన్నమయ్యకోసం గుళ్ళో ప్రత్యేక పూజలు జరిపించారు. లక్కమాంబ భజనచేస్తూచేస్తూ అలా సొలిపోయింది. మగతలో ఏదో గొణుగుతూంది—

"తిరుమలప్ప.... తిరుమలప్ప అన్నమయ్య, అన్నమయ్య!" నారాయణయ్య విన్నాడు అతనికి ఏదో స్ఫురించింది. మరునాడు లక్కమాంబను పిలుచుకొని తిరుమలకు బయలుదేరాడు.

పోయిన విధి దొరికింది :

తిరుమలలో అన్నమాచార్యుడు ఘనవిష్ణువువద్ద విష్ణుతత్త్వాన్ని తెలుసుకుంటూ వుండేవాడు. ఆ యతి అన్నమాచార్యుని ఆదరంతో చూసేవాడు. గురువు చెప్పిన మాటలను మననం చేసుకుంటూ పాటలు పాడేవాడు శిష్యుడు. ఆ రోజు అన్నమాచార్యుడు దేవాలయం ముందు మండపంలో కూర్చుని తన్మయత్వంతో గానం చేస్తున్నాడు. వందలాది భక్తులు పారవశ్యంతో వింటున్నారు. తిరుమలకు చేరిన లక్కమాంబ, నారాయణసూరి కుమారుని కంఠం గుర్తుపట్టారు. వాళ్ళ



సంతోషానికి అవధుల్లేవు. లక్కమాంబ "అన్నా" అంటూ ఆ గాయకునివైపు పరుగెత్తింది. అమ్మ పిలుపు విన్న అన్నమాచార్యుని గానం ఆగిపోయింది. "తల్లీ" అంటూ అమ్మ ఒడిలో వాలిపోయాడు. తండ్రి నారాయణయ్య ఆనందంగా గర్వంగా తనయుని దగ్గరకు తీసుకున్నాడు. అన్నమాచార్యునిలో ఏర్పడిన మార్పును గమనించాడు. "స్వామీ! వేంకటేశ్వర! వీడు నీ వరప్రసాదం. నీవే కాపాడుకో!" అన్నాడు. ఘనవిష్ణువు వాళ్లను తన మఠానికి తీసుకొని వెళ్లాడు.

**తల్లి మనసు కష్టపెట్టకు:**

ఆ రాత్రి లక్కమాంబ అన్నమాచార్యుని తాళ్లపాకకు రమ్మని బ్రతిమలాడింది. "తల్లీ! నాకిక్కడే బావుంది. పెరుమాళ్లను వదలి నేనెలా రాను? నన్ను మన్నించి ఆశీర్వదించు" అన్నాడు. అన్నమాచార్యుడు. తల్లి పట్టినపట్టువదలలేదు. అన్నమాచార్యునికి ఎటూ పాలుపోలేదు. తల్లిని కాదనలేడు. వేంకటప్పనూ వదలి వెళ్ళలేడు. ఇలా ఆలోచిస్తూ అన్నమాచార్యుడు నిద్రపోయాడు. కలలో ఒక తేజస్సు కనిపించింది. "అన్నా! తల్లి మనసు కష్టపెట్టకు. తాళ్ళపాకకు తిరిగివెళ్ళు. నీకు సకల శుభాలు సమకూరుతాయి. పరచింతలుమాను. పరతత్త్వాన్ని తెలుసుకో" అన్న

ప్రబోధం వినిపించింది. అన్నమాచార్యునికి అంతా అగమ్యగోచరంగా ఉంది. "ఇది స్వామి ఆదేశం" అని తెలుసుకున్నాడు తల్లి దండ్రులతో కలసి తాళ్ళపాకకు తిరిగి వెళ్ళాడు.

గృహస్థాశ్రమం :

అన్నమాచార్యునికి పదహారేండ్లు నిండాయి. తల్లిదండ్రులు వివాహప్రయత్నాలు చేయసాగారు. ఎప్పుడూ పాటలు పాడుకొనే నామాల దాసరయ్యకు పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. అన్నమాచార్యుని లోకం వేరు. గుళ్ళు గోపురాలు తిరుగుకుంటూ ఎప్పుడో ఇల్లు చేరేవాడు. కొన్నాళ్ళు ఇంటి ముఖమే చూసేవాడు. కాడు. ఆ మహా భక్తుని ధోరణి, ధ్యాస వేరు. కొన్ని విచిత్రమైన పరిస్థితుల్లో, భగవత్సంకల్పంవల్ల, అన్నమాచార్యుడు తిమ్మక్క, అక్కలమ్మ అనే ఇద్దరు కన్నెలను వివాహమాడాడు అన్నమాచార్యుడు గృహస్థాశ్రమ ధర్మం నిర్వహిస్తూ భగవంతుని సేవలో నిమగ్నుడయ్యాడు.

కొన్నిరోజులు గడిచాయి :


అది క్రీ. శ. 1424 క్రోధి సంవత్సరం వైశాఖ మాసం, విశాఖ నక్షత్రం అన్నమాచార్యుడు పుట్టిన రోజు. తిరుమలకు

వెళ్ళాడు. స్వామిని దర్శించుకొని ఆ రాత్రి వరాహస్వామి గుడి ప్రక్కన ఉన్న మండపంలో విశ్రమించాడు. ఎంతసేపటికి నిద్రపట్టలేదు. వెంటనే తంబుర తీగలు సవరించి పాటకు ఉపక్రమించాడు. ఏదో రాగమందుకున్నాడు. విచిత్రమైన అనుభూతి కలుగుతున్నది. హృదయంలో అలజడి ప్రారంభమైంది. భావంలో ఏవో బొమ్మలు అస్పష్టంగా కదలుతున్నాయి, నారదుని వీణా గానం వినిపిస్తున్నది. తుంబురుని పాట వినిపిస్తున్నది........ హఠాత్తుగ అన్నమాచార్యుని కంఠం నుండి ఒక కొత్త పాట అవతరించింది.

బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానె నీ పాదము.

చెలఁగి వసుధ కొలిచిన నీ పాదము
బలి తలమోపిన పాదము
తలఁకక గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము.

కామిని పాపము కడగిన పాదము
పాము తల నిడిన పాదము




ప్రేమపు శ్రీసతి పిసికేటి పాదము
పాము(?)డి తురగపు పాదము.

పరమ యోగులకు పరిపరి విధముల
వరమొసఁగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమ పదము నీ పాదము.

శ్రీనివాసుని దివ్యపాదాలు హృదయంలో నిలిచి పోయాయి. అవి బ్రహ్మదేవుడు ప్రతినిత్యం కడిగే పాదాలు, త్రివిక్రమావతార సందర్భంలో భూమిని ఆకాశాన్ని కొలిచినపాదాలు. బలిచక్రవర్తిని పాతాళానికి త్రొక్కిన పాదాలు. అహల్య పాపాన్నికడిగిన పాదాలు. కాళింగుని పడగలను మర్దించిన పాదాలు. సంసార దుఃఖాన్ని పోగొట్టి శాశ్వతమైన ఆనందాన్ని ప్రసాదించే పాదాలు. ఈ తిరుమలకొండ స్థిరమైంది. నేనే పరబ్రహ్మాన్ని అని తెలిపే శ్రీపాదాలు. ఆ పాటను మాటిమాటికి పాడుకోసాగాడు.

రోజుకొక సంకీర్తన:

భావసముద్రంలో ఓలలాడుతున్న అన్నమాచార్యునికి వెంకటేశ్వరస్వామి సాక్షాత్కరించాడు. అన్నమాచార్యుడు ఆ స్వామి



పాదాలమీద వాలిపోయాడు. "ఆచార్య! నీవు ధన్యుడవు. నీ నోట సంకీర్తన అవతరించింది. పల్లవి, చరణాలతోకూడిన ఈ కీర్తనకు ఒక స్థిరత్వం కల్పించు. నీవు పదకవితా పితామహుడవు. ఈ నాటి నుండి ఏమరక సంకీర్తనయజ్ఞం నిర్వహించు. రోజు కనీసం ఒక పాటైనా నీ నోట వినవలె. నీ సంకీర్తనలు తప్ప మరెవ్వరినీ వినను. ఇది నా ప్రతిజ్ఞ. ఇదే నీ వ్రతం" అని వేంకటేశ్వరస్వామి ఆనతిచ్చి అదృశ్యమయ్యాడు.

**దేశసంచారం:**

అన్నమాచార్యుడు స్వామి ఆదేశాన్ని పాటిస్తూ సంకీర్తన యజ్ఞం నిర్వహించేవాడు. ఊరూరు వాడ వాడ తిరుగుతూ పాటలు పాడేవాడు. గుడిచేరి గుడిలో దేవుని కీర్తించి గుడిలోచేరే ప్రజలకు స్వామిమీద పాటలు పాడి వినిపించేవాడు. ఆ పాటలలో, తేటతేట తెలుగు మాటలకు మురిసిపోయేవారు. ఆ మాటలలోని అర్థాన్ని గమనించి ఆనందించేవాళ్ళు.

ఇలా అన్నమాచార్యుడు సంచారం చేస్తూ శఠకోపయతులను గురించి విన్నాడు. శఠకోపయతి గొప్పతపస్సంపన్నుడు. అహోబిలంలో వెలసిన నరసింహస్వామి యతి రూపంలో ప్రత్య

క్షమై శఠకోపయతులకు సన్న్యాసాశ్రమం అనుగ్రహించారట. వారి శక్తియుక్తులను విన్న అన్నమాచార్యుడు యతిని దర్శించు కోవడానికి అహోబిలం వెళ్లాడు. దారిలో నందలూరు చొక్క నాథ స్వామిని, ఒంటిమిట్ట రఘురాముని, కడప వేంకటేశ్వరుని దర్శించాడు. ఆ దేవుళ్ల మీద ఎన్నో పాటలు పాడాడు.

## అహోబిల క్షేత్రం:

అహోబిలానికే అహోబలం అని కూడ పేరు. ఇది వైష్ణవులకు ప్రధాన క్షేత్రం. ఇక్కడే హిరణ్యకశిపుడు పరిపాలించాడు. కన్న కుమారుడైన ప్రహ్లాదుని హింసించాడు. భక్తుని రక్షించడానికి విష్ణువు నరసింహ స్వరూపంతో ఉగ్రస్తంభంలో ఆవిర్భవించాడు. భవనాశినీ తీరంలో నరసింహస్వామి తొమ్మిది రూపాలతో వెలసి వున్నాడు. ఈ క్షేత్రం నల్లమల అడవులలో ఏర్పడింది. ఈ అడవి చిరుతపులులకు, సింహాలకు ప్రసిద్ధి. ఈ అడవులలో అన్నమాచార్యుడు నిర్భయంగ నడిచి వెళ్ళాడు. ఇక్కడ దిగువ అహోబలం, ఎగువ అహోబలం అని రెండు వున్నాయి. దిగువ అహోబలంలో ప్రహ్లాదవరదుడనే పేరుతో లక్ష్మీ నరసింహస్వామి వెలసి వున్నాడు. ఎగువ అహోబిలంలో ఒక బిలంలో ఉగ్రరూపంతో

స్వామి హిరణ్యకశిపుని పొట్ట చీలుస్తూ ఆవిర్భవించి ఉన్నాడు. అన్నమాచార్యుడు ఆ దివ్యమూర్తులను కీర్తించాడు.

**శఠకోప యతి సేవ :**

భవనాశినీ నది ఒడ్డు మీద ఒక మండపంలో అపర నరసింహస్వామివలె శఠకోప యతులు కూర్చున్నారు. అన్నమాచార్యుడు శఠకోప యతుల పాదాలపై వాలాడు; ఆనందంతో ఆవేశంతో ఆ యతిని స్తుతించాడు. అతని వద్ద సుమారు పన్రెండేండ్లు శుశ్రూష చేశాడు. వైష్ణవ ఆగమాలన్నీ నేర్చుకున్నాడు. విష్ణు తత్త్వాన్నిలా అర్థం చేసుకున్నాడు—" విష్ణువు దయామయుడు. సకల ప్రాణులు విష్ణువుని చేరడానికి అర్హులు. జాతితో కాని మతంతో కాని, వర్ణంతో కాని వర్గంతో కాని పనిలేదు: శరణాగతి మంత్రం పఠిస్తే చాలు. భగవంతుడు పశుదౌతాడు". శఠకోప యతి బోధనలు అన్నమాచార్యుని ఆకట్టుకొన్నవి. ఆ ప్రబోధాన్ని వినిపించడానికే అన్నమాచార్యుడు సిద్ధమయ్యాడు; అందరికీ చెప్పాడు.

తందనాన అహి తందనాన పురె
తందనాన భళా తందనాన

బ్రహ్మ మొకటె పర-బ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే.

కందువగు హీనాధికము లిందులేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ.

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే
చండాలుడుండేటి సరిభూమి యొకటే.

కడఁగి యేనుఁగు మీఁద కాయు యెండొకటే
పుడమి శునకము మీఁద-పొలయు నెండొకటే
కడు పుణ్యులను బాప కర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటేశ్వరు నామమొకటే.

ప్రసిద్ధి :

అన్నమాచార్యుని సంస్కారం గొప్పది. తనకు దొరికిన గురువు, దైవము ఇరువురూ భక్త సులభులే. మానవజాతి

కల్యాణం కోసం వైష్ణవ తత్త్వాన్ని అన్నమాచార్యుడు కమ్మని పాటల ద్వారా ప్రచారం చేయసాగాడు. అన్నమాచార్యుని సంకీర్త నలు దేశవ్యాప్తం అయ్యాయి. టంగుటూరును పాలించే సాళ్వ నరసింగరాయలు ఆ పాటలూ, అన్నమాచార్యుని మహిమలు విన్నాడు. అన్నమాచార్యుని దర్శించడానికి ధన, కనక వస్తు వాహ నాలతో తాళ్లపాకకు వెళ్ళాడు.

నరసింగరాయలకు గురుత్వం :

సాళ్వనరసింగరాయలు తాళ్లపాకకు సమీపంలో ఉన్న టంగుటూరులో దండనాథుడుగా ఉండేవాడు; మహావీరుడు. అతని పేరు నరసింగరాయలు. 'సాళ్వ' అనేది బిరుదం. తర్వాత తర్వాత ఇది ఇంటి పేరుగా స్థిరపడింది. సాళ్వనరసింగరాయలు అన్నమా చార్యుని తన గురువుగ భావించాడు. అన్నమాచార్యుని అనుమతి లేకుండ నరసింగరాయలు ఏ పనీ చేసేవాడు కాదు. అన్నమా చార్యుని ఆశీర్వాదబలంవల్ల తన పరాక్రమంవల్ల నరసింగరాయలు పెనుగొండ రాజ్యానికి ప్రభువయ్యాడు. అన్నమాచార్యుని పెను గొండ సీమకు ఆహ్వానించి గొప్ప సన్మానం చేసి తనకు తోడునీడగ అక్కడే ఉండమని ప్రార్థించాడు. తన భగవత్సంకీర్తనకు ఆటంకం

కొనంతవరకు అక్కడే ఉంటానన్నాడు. రాజు అన్నమాచార్యునికి సకల సదుపాయాలను సమకూర్చాడు. వైష్ణవ ధర్మవ్యాప్తికి రాజాశ్రయం ఉపకరిస్తుందనే ఆచార్యుడు అంగీకరించాడు. దేవాలయాలను కేంద్రాలుగా చేసుకొని సంకీర్తనల ద్వారా విశిష్టాద్వైత మత వ్యాప్తి చేయసాగాడు.

ఒకనాడు, రాజు, అన్నమాచార్యుని తన కొలువుకూటానికి ఆహ్వానించాడు. మంత్రులు, సామంతులు, దండనాథులు, అంతఃపుర స్త్రీలు సభలో ఉన్నారు. రాయలు అన్నమాచార్యుని ఒక మధురమైన సంకీర్తన వినిపించమని ప్రార్థించాడు. ఆచార్యుడు ఇలా ఒక మధురమైన శృంగారపదాన్ని పాడాడు.


ఏమొకో చిగురుటధరమున యెడనెడ కస్తూరి
నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా

కలికిచకోరాక్షికి కడకన్నులు కెంపై తోఁచిన
చెలువం బిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువున ప్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు
నిలువున పెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా.

చెఱసాలలో అన్నమయ్య:

ఆ పాట విని రాజూ, సభలోనివారు పరవశించారు. రాజు అన్నమాచార్యుని ఘనంగా సత్కరించాడు. రాజు లోభంతో "ఇటువంటి పాట నా మీద కూడ ఒకటి పాడండి" అని అన్నమాచార్యుని కోరాడు. ఆ హరిభక్తుడు చెవులు రెండు గట్టిగ మూసుకున్నాడు. ఆసనం నుండి దిగ్గన లేచి "రాజా! ఎంత నీచమైన మాట అన్నావు. హరిని గురించి పొగడే ఈ నాలుకతో ఇతరులను ఎలా స్తుతించేది? నీకు, నీ కొలువుకు నమస్కార"మని సభనుండి నిష్క్రమించాడు. నలుగురి యెదుట అన్నమాచార్యుడు తిరస్కరించడం రాజుకు తల కొట్టివేసినంత పనైంది. వెంటనే భటులను పిలిపించి అన్నమాచార్యుని బంధించి తెప్పించాడు. అతని చేతులకు, కాళ్లకు మూరు రాయరగండ సంకెల బిగించాడు. చెరసాలలో త్రోయించాడు. అన్నమాచార్యుడు వేంకటేశ్వరుని గురించి దీనాతిదీనంగా ఒక పాట పాడాడు.

నీ దాసుల భంగములు నీవు చూతురా
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా
పాలసముద్రముమీఁద పవళించినట్టి నీకు
బేలలై సురలు మొఱవెట్టినయట్టు



వేళతో మా మనవులు విన్నవించితిమి నీకు
యేల నిద్దిరించేవు మమ్మిట్టే రక్షించరాదా.
ద్వారకా నగరములో తగనెత్తమాడే నీకు
చీరాన ద్రౌపది మొఱవెట్టినయట్టు
ఘోరపు రాజసభల కుంది విన్నవించితిమి
యేరీతి పరాకు నీకు నిఁక రక్షించరాదా.
యెనసి వైకుంఠములో నిందిరకూడున్న నీకు
పెనఁగి గజము మొఱవెట్టినయట్టు
చనవుతో మా కోరికె సారె విన్నవించితిమి
విని శ్రీవేంకటేశుఁడ వేగ రక్షించరాదా.

**హరిభక్తుల నవమానించకు :**

అన్నమయ్య పాట ముగించిన వెంటనే సంకెళ్లు తెగి నేల పడ్డాయి. భటులు ఆశ్చర్యపడి ఈ విషయం రాజుకు తెలిపారు.

రాజు ఆచార్యుని వద్దకు వచ్చి "నేను నమ్మను. ఈ సారి సంకెళ్లు బాగా బిగించండి" అని భటులను హెచ్చరించి "ఏమయ్యా

అన్నమయ్యా! ఏదీ, ఈ సారి పాడి సంకెళ్లు తెంచుకో చూద్దాం.'' అని ఎకసెక్కెం చేశాడు. ఆ మహాభక్తుడు రాజు అజ్ఞానానికి నవ్వుకొని వెంకటపతిమీద పాట పాడాడు. రాజు కళ్ల ఎదుటే సంకెల తెగి నేలమీద పడింది. రాజు వెంటనే తన తప్పు తెలిసికొని ఆచార్యుని పాదాలమీద పడి క్షమించమని ప్రార్థించాడు. అన్నమాచార్యుడు రాజుని క్షమించాడు ''రాజా! ఎప్పుడూ హరి భక్తులను బాధ పెట్టవద్దు. భాగవతావమానం భగవదవమానానికి మించింది. కలియుగంలో భగవంతుడు సంకీర్తనంతోనే తృప్తిపడేది. రాజు విష్ణువుతో సమానం. నీవు ధర్మరక్షణ సాగించు'' అని ఆదేశించి అన్నమాచార్యుడు ''రాజాశ్రయం తమవంటి వారికి మంచిదికాద''ని తిరుమల క్షేత్రానికి తరలి వెళ్ళాడు.

## అన్నమయ్య ఆర్తవాదం:

15వ శతాబ్దంలో మతరాజకీయ కల్లోలాలతో ఆంధ్రదేశం సతమతమయ్యేది. మహమ్మదీయులు మనదేవాలయాలను ధ్వంసం చేశారు. గోవులను చంపారు. స్త్రీలను మానభంగం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్నమాచార్యుడు తిరుపతి యాత్ర సాగిస్తున్నాడు. ఒకరోజు దారిలో ఆంజనేయస్వామి గుడిలో విశ్ర

మించాడు. ఇంతలో కొందరు తురకసైనికులు గుర్రాలమీద వచ్చి ఆ గుడిని కూల్చారు. అక్కడున్నవాళ్లను బెదిరించి వాళ్ల మూట ముల్లె దోచుకొని వెళ్ళారు. అన్నమాచార్యునికి అంతుపట్టలేదు. తనవద్ద ఉన్న ఆస్తి వేంకటేశ్వరస్వామి పూజావిగ్రహం. దానిని కూడ దక్కించుకోలేక పోయాడు. ఎదురుగా నిలువెత్తు హనుమంతుల వారి విగ్రహం. కూలిపోయిన గుడిగోడలు. తనవలెనే నిరాశ్రయులైన మనుష్యులు. అన్నమాచార్యునికి దుఃఖం పెల్లుబికింది. దీనాతి దీనంగా ఒకగీతం ఆలపించాడు.

ఇందిరా రమణు తెచ్చి యియ్యరో మాకిటువలె
పొంది యీతని పూజించ పొద్దాయ నిపుడు

ధారుణి మైరావణు దండించి రాము తెచ్చి
నేరుపు మించిన అంజనీతనయా!

ఘోర నాగపాశముల కొట్టి వేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా!
శ్రీ వల్లభునకు నశేషకైంకర్యములా
శ్రీ వేంకటాద్రివైన శేషమూరితి



కైవసమైనయట్టి కార్తవీర్యార్జునుడా యీ
దేవుని నీవేళ నిట్టె తెచ్చి మాకు నియ్యరే

అలా పాడిపాడి అలసి పడిపోయాడు.

ఆంజనేయుని అనుగ్రహం:

ఇలా సొమ్మంతా కొల్లగొట్టుకొని తురక సైనికులు తమ గుడారాలలో చేరి కేరింతలు కొడుతున్నారు. ఇంతలో వాళ్ల మధ్య ఒక కోతి ప్రవేశించింది. వాళ్ళుచూస్తుండగానే గుడారమెత్తుపెరిగింది. అన్నమాచార్యుని పూజావిగ్రహాలున్న సంచీని తీసికొని గుడారాన్ని నేలమట్టం చేసింది.

అన్నమాచార్యుని ఎవరో తట్టి లేపినట్లైంది. కళ్ళుతెరచి చూస్తే ఎదుట పూజావిగ్రహాలు కపించాయి. సంతోషంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు. "స్వామీ! ఇదంతా నీ చలువే" అని వేంకటే శ్వర స్వామిని స్తుతించాడు.

అన్నమాచార్యుడు తిరుమల క్షేత్రం చేరుకున్నాడు. తనజీవిత మంతా ఆస్వామి సన్నిధిలోనే గడపసాగాడు. స్వామి ఉత్సవాలలో ఊరేగింపులలో పాల్గొనేవాడు. ఎన్నోపాటలు పాడేవాడు. సుప్రభాత

సేవ మొదలుకొని ఏకాంత సేవదాకా స్వామికి సంకీర్తనలు పాడి వినిపించేవాడు. 'శృంగారమంజరి' అనే ద్విపద కావ్యం వ్రాశాడు. మధురభక్తిని తెలిపే శృంగార సంకీర్తనలు వినిపించాడు. ఆపాటలు శ్రీనివాసుడు ప్రత్యక్షంగా వినేవాడట.

నవయవ్వనం అంకురిస్తున్నది :

ఒకనాడు అన్నమాచార్యుడు పాడిన శృంగారపదం విని స్వామి ఇలా అన్నాడు "అన్నా! తేనెలూరే నీ శృంగార పదాలు వింటూంటే నాలో కొత్తయవ్వనం వస్తూంది. ఇంతకుముందున్న విరక్తి లేదు". అన్నమాచార్యునికి స్వామితో ఏమిబదులు చెప్పాలో తోచలేదు. తడబడుతూ తడబడుతూ మెల్లగా అంటున్నాడు "స్వామీ! మిమ్ము వేదాలు వినుతించాయి. నిత్యం జ్ఞానులు స్తుతిస్తున్నారు. దేవతలందరూ మీకీర్తిని గానం చేస్తున్నారు.... నేనెంత.... తోలుబొమ్మను. .... నన్ను, పాలుపోసి పెంచిన తండ్రివినీవు. నా నాలుకమీది పాటలు నీవే వినిపిస్తున్నావు.... నీవు మాధవునివి.... నేను నీదాసుడిని.... " ఆచార్యుని పాటలువింటూ శ్రీనివాసుడు చిరునవ్వులు చిందించాడు.


ఎంతఅపచారం :

అన్నమాచార్యుడు మహాభక్తుడు. అతని నోటివెంట వచ్చిన మాట అక్షరాల జరిగి తీరుతుంది. నిర్మలమైన మనస్సు. లోకకల్యాణ

దృష్టి సంకీర్తన యజ్ఞం తపస్సు. ఇంక ఆ మహాపురుషునికి సాటి ఎవ్వరు? ఒకరోజు స్వామికి నైవేద్యంగా మామిడి పళ్లను సమర్పించాడు. పెరుమాళ్లకు అరగింపైన పళ్లను నోటపెట్టుకుంటే పుల్లగావున్నాయి. ఆభక్తునికి చెప్పరాని బాధ కలిగింది. "అయ్యో! నాస్వామికి పులుపు పళ్ళు నైవేద్యం పెట్టానే.... ఎంతఅపచారం జరిగింది?" అని ఆ మామిడి పళ్లచెట్టును తాకి "దీని పళ్ళు పంచదార పళ్లు అగుగాక" అని వేంకటపతిని ప్రార్థించాడు. ఆ జీడిమామిడి పళ్లు తియ్యమామిడిపళ్లయ్యాయి. ఇలా అన్నమాచార్యుని మహిమలు లోకమంతా ప్రాకిపోయాయి.

### అన్నమయ్య ఆశీస్సు:

ఒకపేద బ్రాహ్మణుడు అన్నమాచార్యుని దర్శించి తన వివాహనికి ధన సహాయం అనుగ్రహించమన్నాడు. అన్నమాచార్యుని ఆశీర్వాదం వల్ల ఒక రాజు ఆ బ్రాహ్మణుని పిలిచి పెళ్ళి చేయించి ధనకనక వస్తువాహనాలు సమర్పించాడు. అన్నమాచార్యుని పాటలు వింటేచాలు బలమైన రోగాలు నయమౌతాయి. భూతభేతాళపిశాచాలు పారిపోయేవి. అవి పాటలుకావు. వేంకటేశ్వరస్వామి దివ్య మంత్రాలు



అన్నమయ్య - పురందరదాసు :

అన్నమయ్య మహిమలను, సంకీర్తనలను విని పురందర దాసు తిరుమలకు వచ్చాడు. పురందరదాసు కన్నడ దేశానికి చెందిన భక్తకవి. మహాగాయకుడు. అతనికి కర్ణాటక సంగీత పితామహుడనే బిరుదం వుంది. పురందరదాసు అన్నమాచార్యు లను కలుసుకోవడానికి వెళ్ళాడు. అన్నమచార్యులు మూర్తీ భవించిన వేంకటేశ్వరునిలా కూర్చొని, ఒక చేత్తో తంబుర మీటు కుంటూ మరొక చేత్తో భావాన్ని విప్పి చెప్తూ పాట పాడుతున్నాడు. భక్తులందరు పారవశ్యంతో పలుకుతున్నారు.

శరణు శరణు సురేంద్రసన్నుత శరణు శ్రీసతి వల్లభా
శరణు రాక్షసగర్వసంహార శరణు వేంకటనాయకా.
కమలధరుడును కమల మిత్రుడు కమలశత్రుడు పుత్రుడు
క్రమముతో మీ కొలువుకిప్పుడు కాచినారెచ్చరికయా.

అనిమిషేంద్రులు మునులు దిక్పతులమరకిన్నర సిద్ధులు
ఘనతతో రంభాది కాంతలు కాచినా రెచ్చరికయా.

ఎన్నగల ప్రహ్లాద ముఖ్యులు నిన్ను కొలువఁగ వచ్చిరీ
విన్నపము వినవయ్యా తిరుపతి వేంకటాచలనాయకా.

పురందరదాసు ఆ సన్నివేశం చూస్తూ మైమరచి పోయాడు.
అప్రయత్నంగ అదే ధోరణిలో ఒక పాట పాడాడు.

శరణు శరణు సురేంద్రవందిత శరణు శ్రీపతి సేవిత
శరణు పార్వతితనయ మారుతి శరణు సిద్ధివినాయక

నిటలనేత్రనదేవిసుతనె నాగభూషణ ప్రియనె
తటిల్లతాంకిత కోమలాంగనె కర్ణకుండలధారనె

బటువుముత్తిన పదక హారనె బాహుహస్తచతుష్కనె
ఇట్టి తొడగియు హేమకంకణ పాశ అంకుశధారనె

కుక్షియొళు మహాలంబోదరనె ఇక్షుచాపగెలిదనె
పక్షివాహన నాద పురందర విట్ఠల నిజదాసనె

అన్నమాచార్యులు, పాటపాడే యువకుణ్ణి చూసి, ఆనందంతో దగ్గరకు రమ్మని కళ్ళతోనే పిలిచాడు. పురందరుడు– "స్వామీ! మీ మహిమలను విన్నాను. మీ సంకీర్తనలనూ విన్నాను. అవి పాటలు కావు. నా పాలిటి పరమ మంత్రాలు. నా జన్మ తరించింది, మీరు సామాన్యులు కారు. సాక్షాత్తు వేంకటేశ్వరుని అపరావతారమ"ని స్తుతించాడు. అన్నమాచార్యుడు అప్పటికే బాగా వృద్ధుడయ్యాడు. దాసులవారిని కౌగలించుకొని........"నీవు సామాన్యుడవా! రంగ విఠ్ఠలుని అనుగ్రహానికి పాత్రుడైనవాడివి. నీవు సంధ్య వార్చుకోవడానికి ఆ స్వామితోనే నీళ్ళు తెప్పించుకొన్న భాగ్యశాలివి. నీ పాటలు కర్ణాటకసంగీతానికి తొలి పాఠాలవుతాయ"ని ఆశీర్వదించాడు.

రచనలు :

అన్నమాచార్యుని రచనలెన్నో కాలగర్భంలో కలిసిపోయాయి. వీరి రచనలను రాగిరేకులమీదకూడ వ్రాయించారు. అవన్నీ తిరుమల దేవాలయంలో సంకీర్తన భాండారంలో భద్రపరచారు. కాని మన తెలుగు వాళ్ళ అశ్రద్ధ, అవివేకం, పేరాశల వల్ల అలాంటి రేకులు కొన్ని వేలు పోగొట్టుకొన్నాం. రాగం

విలువ తెలియని జాతి రాగి కోసం వాటిని కరగించుకొన్నది. అన్నమాచార్యులు 32,000 సంకీర్తనలు వ్రాస్తే మనకు 12,000 మాత్రమే దొరికాయి. పంద్రెండు శతకాలు రచిస్తే ఒక శతకము మాత్రందొరికింది. ఇంకా వారు వ్రాసిన ద్విపద రామాయణం, వేంకటాచల మాహాత్మ్యం సంకీర్తన లక్షణం, ఎన్నో భాషల్లో వ్రాసిన ప్రబంధాలు మనం పోగొట్టుకొన్నాం.


**తాళ్లపాక కవుల సేవలు :**

అన్నమయ్య కుమారుడు పెదతిరుమలయ్య, మనుమడు చిన తిరుమలయ్య చిన్నన్న మొదలైనవాళ్లుకూడ మహాకవులు. గాయకులు. వీళ్లంటరినీ తాళ్లపాక కవులని వ్యవహరిస్తారు ఈ తాళ్లపాక కవులు తెలుగు భాషకు చేసిన సేవ చాల గొప్పది. సంకీర్తనలు ద్విపదలు, ఉదాహరణలు, దండకాలు, శతకాలు, వ్యాఖ్యానాలు, లక్షణగ్రంథాలు, రగడలు మొదలైన ప్రక్రియల్లో రచనలు చేశారు. అన్నమాచార్యుల పెద్దభార్య తిమ్మక్క-తెలుగులో తొలి కవయిత్రి ఈమె కుమారుడు నరసింగన్న మహాకవి. ఈ తాళ్లపాక కవులు కేవలం కావ్యాలు వ్రాయడమే కాదు, ఎన్నో దేవాలయాలు నిర్మించారు. పడిపోయిన గుళ్లను

పురస్కృత్తు చేయించారు. వైష్ణవ దేవాలయాల్లో సంకీర్తనలు పాడే ఏర్పాట్లు చేశారు. ఎన్నో ఉత్సవాలను ఊరేగింపులను ప్రవేశపెట్టారు. తిరుమల దేవాలయానికి ఎన్నో కైంకర్యాలు చేశారు. మండపాలు నిర్మించారు. స్వామి పుష్కరిణికి మెట్లు కట్టించారు. కల్యాణోత్సవం ప్రవేశ పెట్టారు. బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. వీరు చేసిన సేవలను తెలిపే శాసనాలు సుమారు అరవై దాకా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శిలాక్షరాలుగ నిలిచి ఉన్నాయి.

**అవతార సమాప్తి :**

అన్నమాచార్యులు క్రీ. శ 1503లో నిర్యాణం చెందారు; అది దుందుభి సంవత్సరం ఫాల్గుణ బహుళ ద్వాదశి. అన్నమాచార్యుడు బాగా వృద్ధుడయ్యాడు. అప్పటికి అతని వయస్సు 95 ఏండ్లు. మెల్లగ పెదతిరుమలయ్యను దగ్గరకు పిలిచాడు. రహస్యంగా ఇలా అన్నాడు. — "తిమ్మప్పా! నేటితో నా సంకీర్తన యజ్ఞం సమాప్తమౌతుంది. ఇంక దినానికి ఒక్క సంకీర్తన తక్కువ కాకుండా శ్రీనివాసునికి అర్పించే బాధ్యత నీది. ఈ యజ్ఞం నీవే కొనసాగించవయ్యా"..... అన్నమాచార్యుడు పెద తిరుమలయ్య



చేతికి తంబుర, చిరుతలు అందించాడు. తిరుమలయ్య కళ్లలో నీళ్లు నిండాయి. అన్నమాచార్యుడు కుమారుని తల నిమురుతూ ఏదో అస్పష్టంగ పలికాడు.........అది వేంకటేశ మంత్రం కాబోలు! గంభీరంగా అడుగులు వేసుకుంటూ ఆ కారణజన్ముడు తిరుమల మందిరంలో కలసిపోయాడు ......ఏదో ఒక తేజస్సు తండ్రి శరీరం నుండి వెలువడి వేంకటేశ్వరునిలో లీనం కావడం పెద తిరుమలయ్య మనో నేత్రాలకు గోచరించింది.. . ..

ప్రతి బహుళ ద్వాదశినాడు పెద తిరుమలయ్య ఇలా పాడుకుంటూ ఉండేవాడు.........

దినము ద్వాదశి నేఁడు తీర్థ దివసము నీకు
జనకుండ అన్నమాచార్యుఁడ విచ్చేయవే

అనంత గరుడ ముఖ్యులైన సూరిజనులతో
ఘననారదాది భాగవతులతో
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ
పెనుగొని యారగించ విచ్చేయవే

వైకుంఠాన నుండి యాళువారల లోపల నుండి
లోకపు నిత్యముక్తుల లోన నుండి
శ్రీకాంత తోడ నున్న శ్రీవేంకటేశుఁగూడి
యీకడ నారగించ నింటికి విచ్చేయవే

సంకీర్తనముతోడ సనకాదులెల్ల బాడ
పొంకపు శ్రీవేంకటాద్రి భూమినుండి
లంకె శ్రీవెంకటుగిరి లక్ష్మివిభుడ నీవు
సంకెల మా యింటివిందు లారగించవే

(పెద తిరుమలాచార్యులు)

చిన తిరుమలయ్య తాతగారికి తిరువారాధన నిర్వహిస్తూ ఉండేవాడు.

*

## అనుబంధము

ఉగ్గువెట్టరే వోయమ్మా చె
య్యొగ్గినిదె శిశు వోయమ్మా

కడుపులోని లో కమ్ములు కదలీ
నొడలూచకురే వోయమ్మా
తొడికెడి సరుగన తొలఁగ తీయరే
వుడికెడి పాలివి వోయమ్మా

చప్పలు వట్టుక సన్నపు బాలుని
నుప్పర యెత్తకు రోయమ్మా
అప్పుడె సకలము నదిమీనొరనె
వొప్పదు తియ్యరె వోయమ్మా

తొయ్యలు లిటు చేతుల నలఁగించక
వుయ్యాల నిడరే వోయమ్మా
కొయ్యమాటలను కొండల తిమ్మని
ఒయ్యన తిట్టకు రోరమ్మా

జో అచ్యుతానంద జోజో ముకుంద
రావె పరమానంద రామగోవింద.

నందు నింటను జేరి నయము మీరంగ
చంద్రవదనలు నీకు సేవ చేయంగ
అందముగ వారిండ్ల ఆడుచుండంగ
మందలకు దొంగ మా ముద్దురంగ.

అంగజుని గన్న మా యన్న యిటు రారా
బంగారు గిన్నెలో పాలు పోసేరా
దొంగ నీవని సతులు పొంగుచున్నారా
ముంగిట నాడరా - మోహనాకార

గోవర్ధనంబెల్ల గొడుగుగా పట్టి
కావరమ్మున నున్న కంసు పడగొట్టి
నీవు మధురాపురము నేల చేపట్టి
ఠీవితో నేలిన దేవకీపట్టి

అంగుగా తాళ్ళపా కన్నయ్య చాల
శృంగార రచనగా చెప్పె నీ జోల
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల.

ధర్మాన్ని కాపాడండి - ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది

హిందూ ధర్మ రక్షణ సంస్థ

తిరుమల తిరుపతి దేవస్థానములు